www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 01 (కాంప్లిమెంటరీ కాపీ) | సోమవారం | 01.04.2024

# అధైర్య పడకండి..

- రైతులకు మాజీ సీఎం కేసీఆర్ భరోసా
- రైతన్నలు ఏడుస్తుంటే ఢిల్లీలో రేవంత్ షికార్లు
- లక్షల ఎకరాలలో పంట ఎండినా.. పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- జనగామ, సూర్యాపేట, నల్గొండ జిల్లాలో పంటలను పరిశీలించిన కేసీఆర్

2






## పార్లమెంటు సీటుకు సమ్మయ్య గురి

- పోటీకి సై అంటున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత
- వరంగల్ నుంచి బరిలో నిలిచేందుకు కసరత్తు
- పలు పార్టీల పెద్దలతో మంతనాలు
- బీఆర్ఎస్ టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు?

పార్లమెంటు ఎన్నికల వేళ సీట్ల కేటాయింపులో వివిధ పార్టీలు తర్జనబర్జన పడుతున్నాయి. ఎలక్షన్‌కు ఇంకా నెలన్నర రోజులే ఉండడంతో తీవ్ర కసరత్తు అనంతరం ఇప్పటికే అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు దాదాపు అన్ని స్థానాల్లో అభ్యర్థుల పేర్లు ఖరారు చేశాయి. కానీ వరంగల్ పార్లమెంటు స్థానం ఈసారి హాట్ టాపిక్‌గా మారింది. ప్రధాన పార్టీలకు ఇక్కడ అభ్యర్థులను ఎంపిక చేయడమే పెద్ద సవాల్‌గా మారింది. ఈ తరుణంలో జనగామ జిల్లా దేవరుప్పల మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య కూడా పోటీలో ఉంటానంటూ ప్రకటించడం ఉమ్మడి వరంగల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

- మన చౌరాస్తా ప్రతినిధి, జనగామ

3



## కాంగ్రెస్‌లోకి కడియం ఫ్యామిలీ

- కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి

**జనగామ, (మన చౌరాస్తా ప్రతినిధి) :** పార్లమెంట్ ఎన్నికల వేళ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన పార్టీల్లో వలసలతో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ పలువురు సిట్టింగ్ ఎంపీలు పార్టీ మారగా.. తాజాగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కడియం కావ్య కాంగ్రెస్‌లో జంప్ అయ్యారు. ఆదివారం వారికి సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.



## కేసీఆర్ ముందు నీ బిడ్డను పరామర్శించు

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

2 లో

General News



# అధైర్య పడకండి

**జనగామ, (మన చౌరాస్తా ప్రతినిధి) :** అన్నదాతకు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పొలంబాట పట్టారు. రైతుకు బాసటగా నిలిచేందుకు, కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధరావత్‌తండాలో ఎండిన వరి పంట పొలాలను మాజీ సీఎం కేసీఆర్ పరిశీలించారు. ఆయన వెంట మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్ గౌడ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, బండ ప్రకాష్ ఎమ్మెల్సీ రవీందర్ రావు, క్యామ మల్లేశం తదితరులు ఉన్నారు. కలిసి ఎండిన ఈ సందర్భంగా మాజీ సీఎం రైతులు బానోతు వీరనాయక్, లోతు లక్ష్మణ్, గుగులోతు రాజమ్మ, ఆంబోతు సత్తమ్మ, పుల్సోతు ధరమ్ సింగ్‌తో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆంబోతు సత్తమ్మ మాట్లాడుతూ 8 ఎకరాల వరి వేశానని సాగునీరు అందక ఆరు ఎకరాల పంట ఎండిపోయిందని గతంలో నాలుగు బోర్లు వేసి నష్ట పోయామని ఇప్పుడు పంట చేతికి వస్తుందనుకుంటే ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కూతురి పెండ్లి చేద్దామనుకున్నామని ఇలాంటి నష్టం ఎదురైందని మీరే ఆదుకోవాలని, మీ ప్రభుత్వంలోనే సాగునీరు వచ్చిందని అన్నారు. దీంతో కేసీఆర్ స్పందిస్తూ పంట ఎండిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా రైతుల పక్షాన ఉండి పోరాడుతానని రైతులు అధైర్య పడద్దని అండగా ఉంటానని భరోసానిచ్చారు. అదేవిధంగా ఆంబోతు సత్తమ్మ కుమార్తె వివాహానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌కు సూచించారు. అనంతరం అక్కడి నుంచి సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి చేరుకున్నారు. తుంగతుర్తితో పాటు అర్వపల్లి, సూర్యాపేట మండలంలో ఎండిన పంటలను కేసీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ...రైతులకు అన్ని విధాల పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తమది రైతు ప్రభుత్వమని, అందుకే తమ ప్రభుత్వంలో రైతులందరూ రారాజుల బతికారన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో మళ్లీ రైతుల బతుకులు మొదటి కొచ్చాయంటూ కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## అడుగడుగన బ్రహ్మరథం

ఉదయం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి బస్సులో రోడ్డు మార్గాన జనగామ జిల్లాకు బయల్దేరిన కేసీఆర్‌కు.. అడుగడుగా ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. బీఆర్ఎస్ అధినేతకు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కార్యకర్తలు, ధరావత్ తండా వాసులు ఘనస్వాగతం పలికారు. కేసీఆర్ వెంట ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్ గౌడ్, జగదీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

- రైతులకు మాజీ సీఎం కేసీఆర్ భరోసా
- రైతన్నలు ఏడుస్తుంటే ఢిల్లీలో రేవంత్ షికార్లు
- లక్షల ఏకరాలలో పంట ఎండినా.. పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- జనగామ, సూర్యాపేట, నల్గొండ జిల్లాలో ఎండిన పంటలను పరిశీలించిన కేసీఆర్




## కేసీఆర్ బస్సు తనిఖీ

బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సును పోలీసులు ఆదివారం తనిఖీ చేశారు. జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో ఎండిన పంటలను పరిశీలించేందుకు ఎర్రవల్లి నుంచి సూర్యాపేట వెళ్లారు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా ఈదులపర్రె తండా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద కేసీఆర్ వాహనాన్ని ఎన్నికల కోడ్ లో భాగంగా పోలీసులు తనిఖీ చేశారు.





## కేసీఆర్ ముందు బిడ్డను పరామర్శించు

- కేసీఆర్ పర్యటన విడ్డూరం
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి, (మన చౌరాస్తా ) :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన పర్యటనపై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. 'కేసీఆర్ రైతులను కాదు.. ముందు తీహార్ జైలులో ఉన్న నీ బిడ్డ కవితను పరామర్శిస్తే బాగుండేది..' అని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పర్యటనపై ఆమె మాట్లాడుతూ.. ఈ పర్యటన విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ పర్యటించిన పొలంలో వరసగా నాలుగు బోర్లు వేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కాళేశ్వరం కుంగి నీటిని దిగువకు విడుదల చేశారు.. కాబట్టే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్లు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పదేళ్లలో రైతులపై లేని ప్రేమ ఈ రోజు గుర్తుకు వచ్చిందా అని నిలదీశారు. బీఆర్ఎస్ నేతలు ఎన్ని వేశాలు వేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కేసీఆర్ కేవలం పార్లమెంట్ ఎన్నికల కోసమే రైతుల పాట పాడుతున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ పాపం పండే రోజులు దగ్గర పడ్డాయని.. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎర్రబెల్లి దయాకర్ రావు జైలుకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు.

## ఏ ముఖం పెట్టుకుని రైతుల వద్దకు వచ్చినవ్..

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, (మన చౌరాస్తా ) :** పల్లెబాట పట్టిన కేసీఆర్‌పై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాట్ కామెంట్లు చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పిన ఆయన తీరు మార్చుకోలేదు ఇంకా దురహంకారంతో వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎన్నో పథకాలను అమలు చేయడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు అన్ని విధాలుగా పథకాలు అందిస్తున్నామని తెలిపారు. గతంలో కేసీఆర్ ఏమి చేయలేదనే ప్రజలు బుద్ధి చెబితే, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని రైతుల పొలాలకు వస్తున్నావని ప్రశ్నించారు. కాలేశ్వరం అని చెప్పి లక్షల కోట్లు దండుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసావని విమర్శించారు. తెలంగాణ ప్రజలు నిన్ను వద్దని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేస్తే ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ మళ్లీ రైతుల పొలాల్లోకి ఏ ముఖం పెట్టుకుని వెళ్తున్నావని ప్రశ్నించారు. గత సంవత్సరం వర్షాలు తక్కువ పడటం వల్లే భూగర్భజలాల్లో నిరు తగ్గిందని బీర్ల అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల కరువు రాలేదని, వర్షాలు లేక ప్రాజెక్టులన్నీ ఎండిపోయాయని తెలిపారు. రైతుల పొలాలు ఎండిపోవడం బాధాకరమే వారి గురించి మా ప్రభుత్వం ఆలోచిస్తుందని తెలిపారు. గత ఎలక్షన్స్‌లో నిన్ను ఫామ్ హౌస్ కు పరిమితం చేస్తే మళ్లీ ఎలక్షన్స్ వచ్చాయని పల్లెబాట పట్టావాని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోటే రైతుల సంక్షేమ సాధ్యమవుతుందని బీర్ల ఐలయ్య అన్నారు. కేసీఆర్ చిల్లర మల్లార మాటలు బంద్ చేసి ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి ప్రతిపక్ష పాత్రను సంక్రమంగా పోషించాలని సూచించారు.

Local News

## పార్లమెంటు సీటుకు
# సమ్మయ్య గురి



- పోటీకి సై అంటున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత
- వరంగల్ నుంచి బరిలో నిలిచేందుకు కసరత్తు
- పలు పార్టీల పెద్దలతో మంతనాలు
- బీఆర్ఎస్ టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు?

**జనగామ, (మన చౌరాస్తా ప్రతినిధి) :**

పార్లమెంటు ఎన్నికల వేళ సీట్ల కేటాయింపులో వివిధ పార్టీలు తర్జనబర్జన పడుతున్నాయి. ఎలక్షన్‌కు ఇంకా నెలన్నర రోజులే ఉండడంతో తీవ్ర కసరత్తు అనంతరం ఇప్పటికే అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు దాదాపు అన్ని స్థానాల్లో అభ్యర్థుల పేర్లు ఖరారు చేశాయి. కానీ వరంగల్ పార్లమెంటు స్థానం ఈసారి హాట్ టాపిక్‌గా మారింది. ప్రధాన పార్టీలకు ఇక్కడ అభ్యర్థులను ఎంపిక చేయడమే పెద్ద సవాల్‌గా మారింది. ఈ తరుణంలో జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య కూడా పోటీలో ఉంటానంటూ ప్రకటించడం ఉమ్మడి వరంగల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సుమారు 20 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చిన గడ్డం సమ్మయ్య గొప్ప కళాకారుడిగా ఎంతో పేరు గడించారు. రామాయణం, భాగవతం, మహాభారతరం, జాంబవ పురాణ గాథల ప్రదర్శనలతో ఆయన పాపులారిటీ సాధించారు. ఇటీవలే జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డును అందజేసింది. దీంతో గడ్డం సమ్మయ్య జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు పొందారు.

### పార్టీ పెద్దలతో మంతనాలు..

ఎవరైనా తనకు ఎస్సీ నియోజకవర్గ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసే అవకాశం కల్పిస్తే బరిలో నిలుస్తానని గడ్డం సమ్మయ్య ఆదివారం జనగామలో ప్రకటించారు. పరోక్షంగా వరంగల్ ఎంపీ సీటు ఆయన ఆశిస్తున్నట్లు చెప్పారు. వరంగల్ ఎంపీ సీటు విషయంలో ఇప్పటికే ప్రధాన పార్టీల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ముందుగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను బీఆర్ఎస్ నుంచి ఎంపీగా బరిలోకి దింపాలని ఆ పార్టీ నిర్ణయించినట్లు వార్తలొచ్చాయి. అదే సమయంలో ఆయన బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించడంతో రెండు రోజులు హైడ్రామా నడిచింది. చివరికి ఆయన బీజేపీలో చేరడం, ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఖరారు కావడం జరిగిపోయింది. దీంతో బీఆర్ఎస్ హైకమాండ్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్యకు గులాబీ పార్టీ టికెట్ ఖరారు చేసింది. అనూహ్యంగా ఇటీవల ఆమె బీఆర్ఎస్ నుంచి పోటీ చేయలేనని పక్కకు తప్పుకుని కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. అయితే, ఇప్పటి వరకు వరంగల్ పార్లమెంటు స్థానానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లను ఖరారు చేయలేదు. ఈ పార్టీల నుంచి వివిధ నాయకుల పేర్లు తెరపైకి వస్తుండగా గడ్డం సమ్మయ్య తాను కూడా అవకాశం ఇస్తే పోటీకి దిగుతానని ప్రకటించడం రాజకీయ చర్చకు దారితీసింది. పద్మశ్రీ అవార్డు గ్రహీతగా జాతీయ స్థాయిలో పేరు గడించిన తనకు అవకాశం ఇవ్వాలంటూ పార్టీలకు అల్టిమేటం జారీ చేశారు. మరోవైపు తన శక్తి మేరకు తన పేరును కూడా పరిశీలించాలని బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ పెద్దలతో ఆయన మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం.



### బీఆర్ఎస్ టికెట్ కోసం..

ప్రస్తుతం రాజకీయంగా బీఆర్ఎస్ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఇప్పటికే పోటీ దింపాలనుకున్న ఇద్దరు నేతలు హ్యాండ్ ఇవ్వడంతో గులాబీ పార్టీ డైలామాలో పడింది. ఈ పరిస్థితినే గడ్డం సమ్మయ్య క్యాష్ చేసుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ ఉప కులానికి చెందిన వ్యక్తి కావడం, చిందు యక్షగానంలో ప్రసిద్ధికెక్కిన కళాకారుడు కావడంతో టికెట్ ఇస్తే తమ వర్గానికి ప్రాధాన్యం ఇచ్చిన క్రెడిట్ బీఆర్ఎస్‌కు దక్కుతుందని, దీంతో అణగారిన వర్గాల పక్షాన బీఆర్ఎస్ ఉందనే మైలేజ్ కూడా వస్తుందని ఆయన తన సన్నిహితుల ద్వారా బీఆర్ఎస్ పెద్దలకు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ నేతలతోనూ ఆయన టచ్‌లో ఉండి తన మనసులోని మాట హైకమాండ్ వద్దకు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నారు. ఏదిఏమైనా గడ్డం సమ్మయ్య పొలిటికల్ కామెంట్స్‌తో వరంగల్ రాజకీయం మరోసారి రసవత్తరంగా మారింది.



“

## దళితులను అణగదొక్కిండు

- కడియంపై అరూరి హాట్ కామెంట్స్

**స్టేషన్‌ఘన్‌పూర్, (మన చౌరాస్తా):** దళితులు రాజకీయంగా ఎదగకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి అడుగడుగునా అడ్డుపడూ అణగదొక్కాడని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆరోపించారు. ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బాధాప్తా చెప్పి పార్టీ మారానని తెలిపారు. కానీ కడియం శ్రీహరి తన కుమార్తెను వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించినా, అందరినీ మోసం చేసి పార్టీ మారారని, ఇది ప్రజలు గమనించాలని కోరారు. పార్టీలలో దళితులను ఎదగనీయకుండా అణగదొక్కి వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. దేశం కోసం నరేంద్ర మోదీ చేస్తున్న సేవలను చూసి భాగస్వామిని కావాలని తాను బీజేపీ చేరానని అరూరి చెప్పుకొచ్చారు. మోదీ నాయకత్వమే దేశానికి శ్రీరామరక్ష అన్నారు. తనను ఆశీర్వదిస్తే అభివృద్ధితో పాటుగా అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారి మురళీధర్, రాష్ట్ర ప్రశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు, జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు రాజేశ్వర్ రావు, వన్నాల రాములు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

### సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

**జనగామ, (మన చౌరాస్తా) :** సీపీఎం నేతలపై దురుసుగా ప్రవర్తించి అనుచిత వ్యాఖ్యలు చేసిన జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాపై చర్యలు తీసుకోవాలని సీపీఎం లీడర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ సెంటర్లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్లే కార్డ్స్ పట్టుకుని నిరసన చేపట్టారు. పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు మాట్లాడుతూ శనివారం ఎన్నికల సంబంధించిన అంశాలపైన ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ పాషా దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టర్ కార్యాలయానికి జిల్లా కార్యదర్శి కనకారెడ్డితో పాటు సీపీఎం ప్రతినిధి బృందం వెళ్లినట్టు తెలిపారు. కలెక్టర్‌ను కలుస్తామని సీసీకి సమాచారం



ఇవ్వగా ఎన్నికలు అయిపోయేంతవరకు రాజకీయ పార్టీ నాయకులు కలవబోమని చెప్పారన్నారు. కలిసేందుకు వెళ్లిన తమ సీపీఎం జిల్లా కార్యదర్శిపై కలెక్టర్ 'ఇక్కడికి ఎందుకు వచ్చావ్.. కంట్రోల్ రూమ్ లో ఫిర్యాదు చేయాలని తెలియా..' 'మీ పార్టీ నుంచి ఎన్నికల సమావేశాలకు వచ్చేటోడు ఎవడు వాడు.. వాడికి తెలువదా..' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా అనుచిత వ్యాఖ్యలు చేసిన కలెక్టర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి సుంచు విజేందర్, ఎండి అజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు బీరయ్య, కళ్యాణం లింగం, కళ్యాణి, బొట్ల శ్రావణ్ పాల్గొన్నారు.

## కడియంను చేర్చుకోవద్దు

- యువకుడి ఆత్మహత్యాయత్నం

**స్టేషన్‌ఘన్‌పూర్, (మన చౌరాస్తా) :** ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లోకి చేర్చుకోవద్దని, ఆయన కూతురు కావ్యకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇవ్వరాదంటూ హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుడు దార విజయకాంత్ ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానిక నాయకులు, గ్రామస్తులు అతడిని అడ్డుకున్నారు. ఆదివారం జన పోరాట సమితి వ్యవస్థాపకుడు బొడ్డు భరత్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతుండగా దార విజయకాంత్ ఒక్కసారిగా లేచి కడియం మాదిగల ద్రోహి అని, తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పటి నుంచి కూడా మాదిగలకు అన్యాయం చేస్తున్నారని రగిలిపోయారు. ఈ క్రమంలో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకునే ప్రయత్నం చేశారు. స్థానికులు అడ్డుకుని అతడిని ఠాణాకు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

# మరో ముందడుగు..

# చౌరాస్తా.. ఇక..

www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way




పాఠక, వీక్షక దేవుళ్లకు నమస్తే..! మూడేళ్ల కింద చిన్న బ్లాగ్‌తో ప్రారంభమైన నా 'చౌరాస్తా' ప్రస్థానం.. అంచెలంచెలుగా విస్తరించి.. వెబ్ సైట్‌గా మారింది. తర్వాత ఈ - పేపర్‌గా ప్రారంభమై.. నాటి నుంచి నేటి వరకు డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. తాజాగా మరో మైలురాయిని దాటుకుంటూ **RNI** పర్మిషన్‌తో ఇక 'మన చౌరాస్తా'గా మారి మరింత విస్తరించబోతోంది. ఇంతకాలం ఆదరించినట్టుగానే ఇక ముందు కూడా మీరు **'మన చౌరాస్తా'** పేపర్‌ను అక్కున చేర్చుకుంటారని ఆశిస్తూ... **– మీ.. ఉప్పలంచి నరేందర్**